సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం | 17 | ఫిబ్రవరి | 2024



ఆదిలోనే హంసపాదు

ఆదిలోనే హంసపాదు అన్నట్టు.. సత్యదేవుని నూతన ప్రారంభమైన వేళ.. సాంకేతిక పరమైన ఆటంకాలతో స్వామివారి ఊరేగింపును అధికారులు వాయిదా వేశారు. - IIలో



లక్ష్మీ నృసింహుని కల్యాణోత్సవాలకు శ్రీకారం

అంతర్వేది శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి వార్షిక దివ్య తిరుకల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. - IIలో

8,300 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కులు చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

డీఐఈవోగా సోమశేఖరరావు బాధ్యతల స్వీకరణ



అమలాపురం టౌన్: డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఐఈవో)గా వనుము సోమశేఖరరావు అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉన్న జిల్లా కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే సోమశేఖరరావు జిల్లా ఇంటర్మీడియెట్ పరీక్షల ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. ఇప్పుడు పూర్తి అదనపు బాధ్యతలతో డీఐఈవోగా చేరారు. ఇప్పటికే ఈయన ప్రత్యేక అధికారి హోదాలో ఈ నెల 5వ తేదీ నుంచి జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షలైన ఒకేషనల్, జనరల్ ప్రాక్టికల్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఇక నుంచి ఆయన డీఐఈవో హోదాలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యను పర్యవేక్షించనున్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

సాక్షి అమలాపురం: వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లాతోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మూడవ దశ రీ సర్వే, అసైన్డ్ భూములపై హక్కుల కల్పన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా సరాసరి వేతనాలు, సరాసరి పని దినాల కల్పన, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పురోగతి అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రీ సర్వే మూడో దశను వేగవంతం చేసి నిర్దేశిత గడువు నాటికి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, సీపీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్.వి.కృష్ణారెడ్డి, పీఆర్ ఎస్ఈ కె.చంటిబాబు, డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావు దొర, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలలో నియామకాలు

సాక్షి అమలాపురం: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లాల కమిటీలలో జిల్లా నుంచి పలువురికి అవకాశం దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కమిటీ కార్యాలయం శనివారం నియామకపు ఉత్తర్వులను జారీ చేసింది. పార్టీ సేవాదళ్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గ్రంధం రవికుమార్, కార్యాదర్శిగా మట్టపర్తి వెంకటరమణ, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా దోమలపాటి సత్యనారాయణ, సహ కార్యదర్శిగా ఎ.రాజ్‌కమల్‌ను నియమించారు. మైనార్టీ సెల్ జిల్లా కమిటీలో షేక్ కాజా బాబు, ఎం.డి.జాఫర్‌లను నియమించారు.

వివాదాల్లేకుండా యాత్ర నిర్వహించాలి

అల్లవరం: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని అమలాపురం నుంచి నిర్వహించే గజమాల యాత్ర ఎలాంటి వివాదాలకు తావులేకుండా సాగేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని తాలుకా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘాధ్యక్షుడు పెమ్మాడి సాయి కోరారు. అమలాపురం నుంచి అంతర్వేది వరకూ సాగే గజమాల యాత్రని రెండుగా విడదీయాలని తాలుకా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘ వ్యవస్థాపకుడు కొల్లు బాబ్జి కుటిల ప్రయత్నం చేస్తున్నారని సాయి ఆరోపించారు. అదే జరిగితే వివాదాలకు దారి తీస్తుందని అన్నారు. రెండు గ్రూపులుగా యాత్ర నిర్వహించాలని ప్రయత్నిస్తే యాత్రకు అనుమతులను పోలీసులు రద్దు చేయాలని కోరారు.

20న ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కల్యాణం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, పంచారామాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి దివ్య కల్యాణం ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు.

20న ఉదయం 5.45 గంటలకు కల్యాణమూర్తులను ఆహ్వానించడం, 8 గంటలకు లక్ష రుద్రాక్ష పూజ, రాత్రి 10.25 గంటలకు దివ్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా 22న 4.45 గంటలకు స్వామి వారి కల్యాణ సదస్యం, వేద ఘన స్వస్తి, 23న మధ్యాహ్నం 2.35 గంటలకు రథోత్సవం, 24న ఉదయం 8.10 గంటలకు వసంతోత్సవం, త్రిశూల చక్రస్నానం, 25న రాత్రి 7.05 గంటలకు భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్తగోదావరి కోనేరులో తెప్పోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో పాల్గొని తరించాలని కోరారు.

పొత్తుకడుపులో పచ్చ కత్తి



- పొత్తులు ఖరారు కాకుండా తమ్ముళ్ల ప్రచారం
- ఆరంభించిన అమలాపురం టీడీపీ ఇన్‌చార్జి ఆనందరావు
- భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో రంగంలోకి దిగిన బండారు.. బుచ్చిబాబు
- మండిపడుతున్న జనసేన కేడర్
- ఇదేనా పొత్తు ధర్మం అని ఆగ్రహం

సాక్షి, అమలాపురం: 'రాజకీయాలలో శాశ్వత మిత్రుడు... శాశ్వత శత్రువు' అంటూ ఉండరంటారు. ప్రత్యర్థులుగా ఉన్నప్పుడు ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం రాజకీయాలు చేయడం సహజమే అయినా... మిత్రపక్షాలుగా ఉన్నప్పుడు మాత్రం మిత్ర ధర్మాన్ని పాటిస్తారు. కానీ ఈ విషయంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు తీరే వేరు. తన నీడన సైతం నమ్మని బాబు మిత్రపక్షాలను సైతం అనుమానిస్తూ... అడుగడుగునా అవమానిస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటారు. బాబు బాటలోనే తమ్ముళ్లు కూడా నడుస్తున్నారు. పొత్తు ధర్మానికి తిలోదకాలు ఇస్తున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సీట్ల పంపకం తేలకున్నా... మిత్రపక్షాన్ని సంప్రదించకుండా టీడీపీ ఇన్‌చార్జులు, పార్టీ టిక్కెట్ ఆశిస్తున్నవారు ప్రచారం ప్రారంభించడంపై మిత్రపక్షమైన జనసేన పార్టీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

గత ఎన్నికల్లో జనసేన పార్టీ గెలిచిన ఏకైక నియోజకవర్గం కోనసీమలోని రాజోలు. దీంతోపాటు పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలలో 30 వేలకు పైబడి ఓట్లు వచ్చాయి. వీటిలో అమలాపురంలో అయితే సుమారు 45 వేల వరకు ఓట్లు పొందింది. ఈ కారణంగా పొత్తులో ఈ జిల్లా నుంచి తమకు అధిక సీట్లు కావాలని జనసేన కేడర్ పట్టుబడుతోంది. ముఖ్యంగా అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ తమ జనసేనకు ఆత్మ గౌరవంగా చెబుతోంది. ఈ విషయంలో టీడీపీ సీట్లు త్యాగం చేసి సహకరించాలని కోరుతోంది. కాని టీడీపీ నాయకత్వం పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గంలో కేవలం రెండు అసెంబ్లీ స్థానాలు మాత్రమే జనసేనకు ఇస్తామని టీడీపీ సంకేతాలు ఇస్తోంది.

ప్రచారం మొదలు పెట్టిన ఆనందరావు

టీడీపీ, జనసేన పొత్తు అనుకున్న దగ్గర నుంచి అమలాపురంలో రెండు పార్టీలో కీలక నేతల మధ్య ఉప్పునిప్పుగా మారింది. జనసేనలో కీలకంగా వ్యవహరిస్తున్న నాయకులు ఒకప్పుడు టీడీపీ నాయకత్వాన్ని వ్యతిరేకించి బయటకు వచ్చినవారే. ఇప్పుడు టీడీపీకి సీటు కేటాయిస్తే మరోసారి తాము వారి కాళ్ల వద్ద పనిచేయాలని వాపోతున్నారు. గతంలో రెండు పార్టీలు నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశాలకు, పార్టీ కార్యక్రమాలకు కీలక జనసేన నేతలు దూరంగా ఉన్నారు. అమలాపురం నుంచి జనసేనను పోటీలో ఉంచాలని కోరగా అధినేత అంగీకరించారని, సీటు తమకే వస్తుందని ఇటీవల పవన్‌ను కలిసిన జనసేన నాయకులు చెప్పుకొచ్చారు. కాని వారం తిరగకుండానే టీడీపీ ఇన్‌చార్జి ఆనందరావు ఏకంగా ఎన్నికల ప్రచార రథాన్ని తయారు చేయించడం, రథసప్తమి మంచిదని ప్రచారం చేయడం జనసేన నాయకులకు మింగుడు పడడం లేదు. ఇంకా సీట్ల సర్దుబాటు కాకుండానే ఎన్నికల ప్రచారం చేయడం పొత్తు ధర్మానికి విరుద్ధమని వారు వాపోతున్నారు. ఆనందరావు చేపట్టిన ప్రచారంపై సొంత పార్టీ టీడీపీలో సైతం వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సీటు తేల్చకుండా ప్రచారం చేయడం వల్ల మిత్రపక్షం జనసేన క్యాడర్‌ను రెచ్చగొట్టడమేనని వారంటున్నారు.

మిగిలిన చోట్లా అదే వరస

జిల్లాలో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలకుగాను మండపేట నుంచి వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాల్సిందిగా చంద్రబాబు మండపేట సభలో పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో రాజోలు నుంచి తాము పోటీ చేస్తామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. మిగిలిన ఐదు అసెంబ్లీలకు పొత్తు ఖరారు కాలేదు. పి.గన్నవరానికి టీడీపీ ఇన్‌చార్జి లేరు. అమలాపురంతోపాటు కొత్తపేట, ముమ్మిడివరాలలో టీడీపీ ఇన్‌చార్జిలు బండారు సత్యానందరావు, దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)లు తామే అభ్యర్థులుగా ప్రచారం చేసుకుంటుండం గమనార్హం. ''బాబు ష్యూరిటీ... భవిష్యత్ గ్యారెంటీ'' పేరుతో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమను ఆశీర్వదించాలని కోరుతున్నారు. టీడీపీ ఇన్‌చార్జిలు నిర్వహిస్తున్న ఈ ప్రచార విషయాన్ని పార్టీ పెద్దలు దృష్టికి తీసుకుని వెళుతున్నా ఫలితం లేకుండా పోయిందని జనసేన పార్టీ ఇన్‌చార్జిలు, నాయకులు వాపోతున్నారు.



టీడీపీ నేత ఆనందరావు తయారు చేసుకున్న ప్రచార రథం



నిర్విఘ్నంగా అన్న ప్రసాదం

- అంతర్వేది నరసన్న కల్యాణానికి దగ్గర పడుతున్న ఘడియలు
- ఏటా పెరుగుతున్న భక్తులు
- కల్యాణం.. రథత్సవం రోజున అన్నదానం నిలుపుదల
- ఆ సమయంలో భక్తుల ఆకలి తీర్చే సత్రాలు
- మూడు రోజుల పాటు 24 గంటలూ అన్నదానం

సాక్షి అమలాపురం: ఆది దేవుడు అంతర్వేది శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి వారి కల్యాణ ఘడియలు దగ్గరపడుతున్నాయి. లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం కమనీయంగా జరగడమే కాదు.. సాధారణ రోజులలో ఆలయాన్ని సందర్శించిన భక్తులకు ఇక్కడ అందించే అన్న ప్రసాదం శుచి... రుచులతో నాణ్యంగా ఉంటుంది. అంతర్వేదికి రోజూ వచ్చే వందలాది మంది భక్తులు ఇక్కడ స్వామి వారి దర్శనానికే కాదు.. ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్నదాన సత్రం వద్ద కూడా బారులు తీరుతుంటారు. ప్రధానంగా ఆలయం వద్ద ఇచ్చే బూరె, పులిహోర రుచికి ఎవరైనా ఫిదా కావాల్సిందే.

అంతర్వేదికి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో 2009 అక్టోబర్ 24వ తేదీన దివంగత మాజీ ఎమ్మెల్యే అల్లూరి కృష్ణంరాజు హయాంలో ప్రారంభమైంది. నాటి నుంచి నేటి వరకు ఇక్కడ భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ నిర్విఘ్నంగా సాగుతోంది. ఆలయానికి వస్తున్న భక్తులతోపాటు అన్న ప్రసాదం స్వీకరించే భక్తుల సంఖ్య కూడా ఏటేటా గణనీయంగా పెరుగుతోంది. 2019–20లలో 4,97,084 మంది అన్న ప్రసాదం స్వీకరించగా, 2020–21లో కరోనా కారణంగా ఈ సంఖ్య 2,51,660లకు, 2021–22లో 3,20,895కు పరిమితమైంది. కాని గత ఏడాది (2022–23)లో మాత్రం ఏకంగా 6,13,173 మందికి పెరిగింది. ఈ ఏడాది ఇది మరింత అధికంగా ఉంటుందని అంచనా.



కల్యాణోత్సవాల సమయంలో సేవలందించే అన్నదాన సత్రాలు

కల్యాణోత్సవాలలో ఆకలి తీరుస్తున్న సత్రాలు

అంతర్వేది నరసింహస్వామి కల్యాణం, తరువాత జరిగే రథోత్సవం రోజున స్వామివారి ఆలయంలో అన్న ప్రసాదం భక్తులకు నిలిపివేస్తారు. ప్రధాన సత్రాలు నాలుగు వరకు ఉన్నాయి. వీటిని దేవదాయ శాఖ నోటిఫై చేసింది. పోలమూరివారి సత్రం, రామినీడి సత్రం, దిరుసుమర్రు, ముశ్శర్ల సత్రాలు ప్రధానమైనవి. ఇవి దేవస్థానం ఆధ్వర్యంలో పనిచేస్తుంటాయి. దశమి నుంచి పౌర్ణమి వరకు ఇక్కడ అన్న ప్రసాదం తయారు చేస్తారు. ఈ ఏడాది 19వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు ఆహారం, తాగునీరు అందిస్తారు. ఇవి కాకుండా వివిధ కులాల వారీగా, స్వచ్ఛంద సంస్థల ద్వారా అన్నదానం చేసే సత్రాలు 20 వరకు ఉన్నాయి. కల్యాణం, రథోత్సవం, పౌర్ణమి ఈ మూడు రోజులకు కలిపి సుమారు నాలుగు లక్షల మంది వరకూ అంతర్వేది వస్తారని అంచనా. వీరిలో 70 శాతం మందికి ఇక్కడే ఆహారం, మంచినీరు అందిస్తారు. ఆయా సత్రాలు ఈ రెండు రోజులూ 24 గంటల పాటు నిరంతరాయంగా అన్న ప్రసాదాలు అందజేస్తారు.

రబీకి నీటి ఎద్దడి రాకుండా చర్యలు

జేసీ నూపుర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నుపూర్ అజయ్

సాక్షి అమలాపురం: రబీ సాగు కీలక దశలో ఉన్నందున డెల్టా పంట కాలువల ద్వారా సాగు నీటి సరఫరాకు ఎటువంటి అవాంతరాలు లేకుండా చూడాలని, పంట కాలువలపై పూడిక తీత పనులు పక్కాగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ ఆదేశించారు. పంట కాలువలపై వంతుల వారీ విధానం పక్కాగా అమలు చేసి రబీకి ఎద్దడి రాకుండా చేయాలన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జేసీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు డెల్టా రైతులు మాట్లాడుతూ పంట కాలువలు, డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. ముంపు కారణంగా గత ఖరీఫ్‌లో పంటలు నష్టపోయామన్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు పూడికతీత పనులు తప్పనిసరిగా చేపట్టాలని కోరారు. గత నెలలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మినిట్స్‌పై తీసుకున్న చర్యలను జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు సభ్యులకు వివరించారు. ప్రస్తుత రబీ సీజన్ సాగు విస్తీర్ణం 1,68,925 ఎకరాలలో ఉందని, ఇప్పటి వరకు ఈ–క్రాప్ బుకింగ్ 97 శాతం పూర్తయిందని వివరించారు. రైతుల ఈకేవైసీ ప్రక్రియ 65 శాతం పూర్తయిందని ఆయన కమిటీ సభ్యులకు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత సీజన్లో ఎరువుల సరఫరా ప్రక్రియ సవ్యంగా సాగుతోందన్నారు. నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన పెంపొందిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భట్నవిల్లి గ్రామంలో పూడుకుపోయిన పంట కాలువను సర్వే చేయించి భూ రికార్డులలో ఉన్న విస్తీర్ణానికి అనుగుణంగా పూడిక తీయించాలని జలవనరుల శాఖ డీఈఈ శ్రీనివాసరావును ఆదేశించారు. డ్రైనేజీ ఇంజినీర్లు, రైతులు సూచించిన పలు డ్రెయిన్లలో పూడికతీత కోసం అంచనాల రూపొందించి నిధులు మంజూరు కోరుతూ రైతుల సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రమేష్, జె.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి వెంకట్రావు పాల్గొన్నారు.

సృజనాత్మకతతోనే కొత్త ఆవిష్కరణలు

- రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు ఏడు ప్రాజెక్టుల ఎంపిక
- డీఈవో కమలకుమారి



విద్యార్థులు, ఉపాధ్యాయులకు ధ్రువీకరణ పత్రాలు, మెమెంటోలు అందజేస్తున్న డీఈవో కమలకుమారి

అమలాపురం టౌన్: సృజనాత్మకతతోనే విద్యార్థులు ఆధునిక విజ్ఞాన శాస్త్రాన్ని అందిపుచ్చుకుని సైన్స్‌పరంగా నూతన ఆవిష్కరణలు చేసి యువ శాస్త్రవేత్తలు అవుతారని డీఈవో ఎం.కమలకుమారి సూచించారు. ఈ నెల 14వ తేదీన అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ 11వ జిల్లా స్థాయి విద్యా విజ్ఞాన ప్రదర్శనలు, ప్రాజెక్టుల పోటీలు –2024లో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 7 ప్రాజెక్టులు ఎంపికైనట్లు ఆమె వెల్లడించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఏడు ప్రాజెక్టుల గురించి ఆమె వివరించారు. అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు విద్యార్థి నక్కా సత్య ప్రవీణ్ రూపొందించిన ప్లాంట్ గోయింగ్ మెషీన్ 97 మార్కులతో ముందంజలో నిలిచిందన్నారు. టేకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వడ్లమూడి సూర్య చైతన్య రూపొందించిన బాస్కెట్ అలారం ఫర్ అపార్ట్‌మెంట్స్ ప్రాజెక్ట్ 94 మార్కులు సాధించిందని చెప్పారు. రావులపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వెలగల సాయి కృష్ణారెడ్డి రూపొందించిన ఇండికేటర్ ఫర్ సైక్లోనిక్ గేటు ప్రాజెక్ట్ ప్రదర్శన 92 మార్కులు, ఊబలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పద్మావతి ప్రభ కుమారి రూపొందించిన బ్యాంక్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ సిస్టమ్ విత్ వాయిస్ అలర్ట్ అండ్ కాల్ అలెర్ట్ టు పోలీసు స్టేషన్ త్రూ జీఎస్ఎం ప్రాజెక్ట్ 92 మార్కులు, సిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బండి మోహన వెంకటేష్ రూపొందించిన వాటర్ పంపు వితౌట్ పవర్ సప్లయ్ ప్రాజెక్ట్ 90 మార్కులు కైవసం చేసుకుందని తెలిపారు. రాజోలు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి దీప్తి కమల్ తేజ్ రూపొందించిన ఆటోమేటిక్ వెహికల్ పార్కింగ్ సిస్టమ్ యూజింగ్ స్మార్ట్ కార్డు ప్రాజెక్ట్ 87 మార్కులు, గోడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బొడ్డు టక్షిత్ రాజేష్ రూపొందించిన ట్రావెలింగ్ బ్యాగ్ విత్ ఫోల్డబుల్ సీట్స్ ప్రాజెక్ట్ 86 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు వివరించారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్య మాత్రమే మనకున్న ఆస్తి అని..ప్రతీ విద్యార్థి విజ్ఞాన శాస్త్రపరంగా సైన్స్ ప్రయోగాలతో మేధకు పదను పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. చివరగా రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు ఎంపికైన ఏడు ఉన్నత పాఠశాలల ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ధ్రువీకరణ పత్రాలు, మెమెంటోలను డీఈవో కమలకుమారి అందించి అభినందించారు.

జగనన్న ప్రభుత్వంలోనే గ్రామాభివృద్ధి

- మంత్రి విశ్వరూప్
- రూ.3.2 కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన



ఎస్.కొత్తపల్లిలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: గ్రామాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే సాధ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం నుంచి వానపల్లి పాలెం మీదుగా ఎస్.కొత్తపల్లి వరకు రూ.3.2 కోట్లతో 3.2 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ పరిధిలో నిర్మిస్తున్న బీటీ రోడ్డుకు శుక్రవారం ఎస్.కొత్తపల్లిలో మంత్రి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా పరిసర గ్రామాల వారు ఇబ్బందులు ఎదుర్కొనడంతో సీఎండీఎఫ్ నుంచి రూ.2 కోట్లు, నాబార్డ్ నుంచి రూ.1.2 కోట్లు కేటాయించామన్నారు. శరవేగంగా రోడ్డు నిర్మాణం పని పూర్తి చేసి ప్రయాణికులకు ఉపశమనం కలిగించాలని అధికారులకు సూచించారు. మమ్మిడివరం నియోజకవర్గం శివారు ప్రాంతం అడవిపేట నుంచి రాఘవులపేట మీదుగా ఎస్.యానం గ్రామం వరకు రూ.2.6 కోట్లతో బీటీ నిర్మిస్తామని గ్రామస్తులకు చెప్పారు. గ్రామంలో ఫీల్డ్ లేబర్ సొసైటీకి అతి త్వరలో రోడ్డును ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో కార్పొరేట్ స్థాయిలో పిల్లలు చదవుకుంటున్నారని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, పీఆర్ ప్రాజెక్ట్ డీఈ అన్యం రాంబాబు, స్థానిక నాయకులు కుంచే చిన్నీ, బొడ్డు బుజ్జి, నడింపల్లి వాసురాజు, లంకే సూరిబాబు, అంగాని రాంబాబు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్ హార్టీ కల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి, నల్లా నాయుడు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 940 మంది హాజరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు 940 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 14 కంపెనీలు ఈ మేళాలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ మేళా ద్వారా వచ్చే ఉద్యోగావకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐటీఐ ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ మాట్లాడుతూ, వేతనం గురించి చూడకుండా తొలుత ఒక సంస్థలో చేరి నైపుణ్యం పెంచుకుంటే అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి చేరవచ్చని అన్నారు. జిల్లా నైపుణ్య సంస్థ అధికారి హరిశేషు మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా పదో తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన వారికి అన్ని రంగాల్లోనూ శిక్షణ ఇస్తున్నామని, తద్వారా వందలాది మంది ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. కోనసీమ జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి నెలా రెండు మేళాలు నిర్వహిస్తున్నామని, 60 శాతం మహిళలు రావడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్లూమ్ అధికారి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి వెండిచీర సమర్పణ

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో వేంచేసిన రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి భక్తులు శుక్రవారం వెండి చీర, వక్షస్థలం, కిరీటం, హస్తాలు, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడి పీఠాలను సమర్పించారు. తెలంగాణలోని మంచిర్యాలకు చెందిన డాక్టర్ కంచి చంద్రయ్య, డాక్టర్ నందినీరాణి దంపతులు 8.50 కిలోల వెండితో వీటిని తయారు చేయించి, సమర్పించారని ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. ఆ వెండి వస్తువులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు.



అధికారులకు వెండి చీర, ఇతర వస్తువులు అందజేస్తున్న భక్తులు

క్లుప్తంగా

అంతర్వేదికి 40 ప్రత్యేక బస్సులు

అమలాపురం రూరల్: ఆంధ్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలాపురం డిపో నుంచి అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణం, రథోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి శుక్రవారం తెలిపారు. 19 తేదీన ఉదయం నుంచి 20వ తేదీ రాత్రి రథోత్సవం అయ్యే వరకు అమలాపురం – అంతర్వేది, అప్పనపల్లి – అంతర్వేది, పల్లం –అంతర్వేది రూట్‌లలో ప్రయాణికుల కోసం 40 ప్రత్యేక బస్సులు నడుపుతునట్లు తెలిపారు.

యుఆర్ హోంమాల్ ప్రారంభం



హోంమాల్‌లో డేఫిల్ స్టూడియోను తిలకిస్తున్న సినీ దర్శకుడు రాజమౌళి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలోనే అతి పెద్ద కంప్లీట్ హోం సొల్యూషన్స్ రిటైల్ షోరూమ్ 'యుఆర్ హోంమాల్'ను సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి శుక్రవారం ప్రారంభించారు. మోరంపూడి జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన మాల్‌ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. హోంమాల్ టీమ్ హేఫిల్ డిజైనర్స్ స్టూడియో కడియాల గోపాలకృష్ణ, కడియాల రఘు, డెకార్ అండ్ డెకార్స్ పాలిక వెంకటరమణ (కళాంజలి శ్రీనివాస్), పాలిక రామకృష్ణ, పున్నమి వెంకట సత్యనారాయణ, రాజమండ్రి ఇన్నోవేషన్స్ కందుల జగన్, శ్రీ హర్ష సామంతుల, సీహెచ్ రమేష్ మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి మాడ్యులర్ కిచెన్స్, వార్డ్‌రోబ్స్ హార్డ్‌వేర్ ఉత్పత్తులు, టైల్స్, ఆర్కిటెక్చరల్ ఉత్పత్తులు, లైటింగ్స్, లగ్జరీస్ సోఫాస్, బ్లాంకో సింక్‌లు, కుళాయిలు, హోమ్ అప్లయన్సెస్ లభిస్తాయని తెలిపారు. మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి భవానీ, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, తోట త్రిమూర్తులు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రుడా చైర్‌పర్సన్ రౌతు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

ఆదిలోనే హంసపాదు

- సత్యదేవుని నూతన రథం ప్రారంభం
- సాంకేతిక కారణాలతో ఊరేగింపు వాయిదా



నూతన రథాన్ని ప్రారంభిస్తున్న ఈఓ రామచంద్రమోహన్, పండితులు

అన్నవరం: ఆదిలోనే హంసపాదు అన్నట్టు.. సత్యదేవుని నూతన రథం ప్రారంభమైన వేళ.. స్వామి ఊరేగింపునకు సాంకేతిక కారణాలు ఆటంకంగా నిలిచాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో అధికారులు రథాన్ని ప్రారంభించి, ఊరేగింపును వాయిదా వేశారు. వివరాలివీ.. రూ.34 లక్షల వ్యయంతో నిర్మించిన సత్యదేవుని నూతన టేకు రథాన్ని రథసప్తమి పర్వదినాన ప్రారంభించి.. దానిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని వేంచేయించి, ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఊరేగించాలని పండితులు నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా కొత్త రథానికి దేవస్థానం పండితులు, ఈఓ కె.రామచంద్ర మోహన్ శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు రథంపై కలశ స్థాపన కూడా చేశారు. అనంతరం ఆ రథాన్ని ట్రాక్టర్‌కు కట్టి రత్నగిరికి చేర్చేందుకు సిద్ధం చేశారు.

అవాంతరాలు ఎదురయ్యాయిలా..

- నూతన రథాన్ని ట్రాక్టర్ సాయంతో రెండో ఘాట్ రోడ్డు మీదుగా ఆదిశంకర మార్గ్‌కు తీసుకువచ్చారు. అక్కడ స్పీడ్ బ్రేకర్ల పైనుంచి వెళ్తున్న సమయంలో రథం వెనుక చక్రాల పక్కన ఉన్న రాడ్డు విరిగిపోయింది. దీంతో రథం నిలిచిపోయింది. అనంతరం ఆ రాడ్డును తొలగించి సపోర్టుగా మరో రెండు రాడ్లు వేశారు. అనంతరం 12 గంటలకు రత్నగిరి పశ్చిమ రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు.
- పశ్చిమ రాజగోపురం పక్కన ఉన్న మార్గం గుండా ఆలయ ప్రాంగణంలోకి రథాన్ని తీసుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, ఆ మార్గం కన్నా రథం వెడల్పు ఎక్కువగా ఉంది. రథం 12 అడుగుల పొడవు, 7.4 అడుగుల వెడల్పు ఉండగా.. ఆ మార్గం వెడల్పు 7 అడుగులు మాత్రమే ఉంది. దీంతో రథాన్ని లోపలకు తీసుకువెళ్లడం సాధ్యం కాలేదు. దీంతో రథాన్ని విడదీసి ఆ భాగాలను లోపలకు తీసుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. అది కూడా కుదరలేదు.
- ఇంజినీరింగ్ అధికారుల్లో ముందుచూపు లోపించడంతో ఈ సమస్య తలెత్తింది. రథం పొడవు, వెడల్పును బట్టి ఆ మార్గంలో అది లోపలకు వెళ్తుందో లేదో ఇంజినీరింగ్ అధికారులు నిర్ధారించాల్సి ఉంది. ఒకవేళ రథం లోపలకు వెళ్లలేని పరిస్థితి ఉంటే, దాని విడి భాగాలను ఆలయ ప్రాంగణంలోకి తరలించి, అక్కడే బిగించి ఉంటే ఈ సమస్య తలెత్తేది కాదు. ఈ ఆటంకాలకు కారకులైన సంబంధిత అధికారులపై ఈఓ రామచంద్ర మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆకాశంలో విహరించిన రథం

సుమారు టన్ను బరువు కలిగిన ఈ రథాన్ని చివరకు బెల్టులతో క్రేన్‌కు తగిలించి, సుమారు 30 అడుగుల ఎత్తుకు లేపి, గంటసేపు ప్రయత్నించిన అనంతరం రాజగోపురం లోపలి వైపు ప్రాంగణంలోకి దింపారు. నేల మీద ఊరేగాల్సిన రథం కాస్తా స్వామి, అమ్మవారు లేకుండా క్రేన్ సాయంతో ఆకాశంలో విహరించడంతో భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. రథాన్ని సురక్షితంగా కిందకు దించిన క్రేన్ ఆపరేటర్‌ను ఈఓ అభినందించారు. అప్పటికి సమయం మధ్యాహ్నం 1.30 గంటలైంది. అప్పటికే ముహూర్తం మించిపోవడంతో నూతన రథంలో స్వామివారి ఊరేగింపును వాయిదా వేశారు. ఆలయ ప్రాంగణంలో నీడ కోసం కట్టిన గ్రీన్ షేడ్స్ క్లాత్ కూడా తగులుతూండటంతో రథాన్ని నైరుతి వ్రత మండపం వద్ద నిలిపివేశారు. మరో ముహూర్తంలో స్వామి, అమ్మవారిని ఊరేగించాలని నిర్ణయించారు. ఈలోగా గ్రీన్ షేడ్ క్లాత్ ఎత్తును మరో రెండడుగుల మేర పెంచాలని ఈఓ రామచంద్ర మోహన్ ఆదేశించారు. దేవస్థానం ఈఈ మురళి, డీఈలు బీఎస్ రాంబాబు, ఉదయ్, ఏఈఓలు కృష్ణారావు, పెద్ద సంఖ్యలో సిబ్బంది, వైదిక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రథాన్ని రాజగోపురం లోపలకు క్రేన్‌తో తీసుకుని వెళ్తున్న దృశ్యం

ఉపాధ్యాయుల ప్రవర్తనపై విద్యార్థినుల ఫిర్యాదు

గొల్లలగుంట హైస్కూల్‌లో విచారణ నిర్వహించిన డీవైఈఓ



గొల్లలగుంట ఉన్నత పాఠశాలలో విచారణకు వచ్చిన అధికారులు

జగ్గంపేట: మండలంలోని గొల్లలగుంట గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల దురుసుగా ప్రవరిస్తున్నారన్న ఆరోపణలపై జిల్లా అధికారుల ఆదేశాలతో విద్యాధికారులు శుక్రవారం విచారణ నిర్వహించారు. జగ్గంపేట ఎంఈఓ స్వామి అందించిన వివరాల ప్రకారం కొద్ది రోజుల క్రితం సోషల్ ఆడిట్‌కు వచ్చిన అధికారుల వద్ద 9,10 తరగతుల విద్యార్థినులు ఇద్దరు ఉపాధ్యాయులు తమ పట్ల ప్రవర్తించే తీరుపై ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. అనంతరం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయన్నారు. డీఈఓ ఆదేశాలతో డీవైఈఓ ఆర్‌జేడీ రాజు, కరప ఎంఈఓ కృష్ణవేణి గొల్లలగుంట హైస్కూల్‌లో విచారణ చేపట్టారన్నారు. విద్యార్థినులకు ప్రశ్నావళి ఇచ్చి వాటిని పూర్తి చేయించి పట్టుకెళ్లారని తెలిపారు. వాటిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తారని తెలిపారు. గొల్లలగుంటకు చెందిన సాయిరాం, శ్యామ్ అనే ఉపాధ్యాయుల ప్రవర్తనపై ఫిర్యాదులు వచ్చాయని ఎంఈవో వివరించారు.

నాల్గవ ఖేల్ ఇండియా కబడ్డీ సమన్వయకర్తగా శ్యామ్‌కుమార్



శ్యామ్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కేంద్ర యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో అస్సాం గౌహతీనగర్‌లో శనివారం నుంచి 22 వరకూ నిర్వహించే 4వ ఖేలో ఇండియా కబడ్డీ పోటీల సమన్వయకర్తగా జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ ఉత్తర్వులు జారీచేయగా శుక్రవారం వర్సిటీ ఆవరణలో జేఎన్‌టీయూకే ఉపకులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అభినందించారు. గత ఏడాది నిర్వహించిన 3వ ఖేలో ఇండియా గేమ్స్‌కు శ్యామ్‌కుమార్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించి విజయవంతం చేశారని, ఈ ఏడాది అదే రీతిలో విజయవంతం చేయాలని కోరారు. శ్యామ్‌కుమార్‌ను అభినందించిన వారిలో వర్సిటీ రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది ఉన్నారు.

లక్ష్మీ నృసింహుని కల్యాణోత్సవాలకు శ్రీకారం

- అంతర్వేదిలో మొదలైన సందడి
- పెళ్లికొడుకుగా ముస్తాబైన స్వామి
- సూర్య, చంద్రప్రభ వాహనాలపై సేవ



స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తున్న అర్చకులు



చంద్ర ప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో శ్రీలక్ష్మీనృసింహస్వామివారి వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సూర్య భగవానుడి జన్మదినం రోజైన రథసప్తమిని పురస్కరించుకుని స్వామివారిని వరుడిగా, అమ్మవారిని వధువుగా అలంకరించారు. ఏటా మాదిరిగానే ముద్రికాలంకరణ(శ్రీవారిని పెండ్లికుమారుని, అమ్మవారిని పెళ్లికుమార్తె చేసే కార్యక్రమం)ను కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాల వారు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు శ్రీవారికి, అమ్మవారికి వైఖానస ఆగమానుసారం, శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రకారం విశేష పూజలు చేశారు. మామిడాకుల భస్మంతో బుగ్గన చుక్కపెట్టి, ఉంగరం తొడిగి పెండ్లికుమారుని, పెళ్లికుమార్తెను చేసే తంతును రమణీయంగా పూర్తిచేశారు. కల్యాణోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అర్చకులు, వేద పండితులు, ప్రముఖులు రథానికి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఆలయం వద్ద నుంచి రథాన్ని గోవింద నామస్మరణల మధ్య మెరకవీధికి తోడ్కొని వెళ్లారు. ఉత్సవాల తొలిరోజు సాయంత్రం సూర్యవాహనంపైన, రాత్రి చంద్రప్రభ వాహనంపైన కొలువుదీరిన స్వామి మాఢవీధుల్లో ఊరేగారు. గ్రామోత్సవాల్లో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాలరాజా బహద్దూర్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో నేడు.....

అంతర్వేది ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం సాయంత్రం గరుడు పుష్పక వాహనంపైన, రాత్రి పుష్పక వాహనంపైన శ్రీస్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ శ్రీస్వామివారి తిరువారాధన, అర్జిత అభిషేకం, బాలభోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ శ్రీసుదర్శన హోమం నిర్వహించనున్నారు.

వైభవంగా రథోత్సవం

- జి.మామిడాడలో ఘనంగా రథసప్తమి
- పోటెత్తిన భక్తులు



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలో శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామి వారి రథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. సూర్యభగవానుడి పుట్టిన రోజైన రథసప్తమి పర్వదినం సందర్భంగా రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 122 సంవత్సరాల చరిత్ర గల సూర్యదేవాలయంలో స్వామి దర్శనాన్ని భక్తులు సెంటుమెంటుగా భావిస్తారన్నారు. దూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. తొలుత అర్చకులు.. సూర్యభగవానుడు, ఆయన దేవేరులైన ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయం బయట ఉంచిన రథంలో ఉత్సవ మూర్తులను పెట్టారు. అనంతరం అర్చకులు అష్ట దిక్పాలిక బలిహరణం చేసి, రథోత్సం ప్రారంభించారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డితో పాటు ఆలయ ఉత్సవ కమిటీ, గ్రామ యూత్ సభ్యులు, భక్తులు సూర్యనారాయణ నామస్మరణతో ఉత్సాహంగా రథాన్ని ముందుకు లాగారు.



జి.మామిడాడలో సాగిన రథోత్సవం

బషీర్ బీబీ ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

భారీగా తరలి వచ్చిన భక్తులు

కొత్తపల్లి: మండలం పొన్నాడలో వేంచేసియున్న బషీర్‌బీబీ (బంగారు పాపమ్మ) ఔలీయా 69వ ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంథల్ (గంధం) తీసి అమ్మవారికి పూయడంతో ఉత్సవాల్ని ముజావర్లు ప్రారంభించారు. మూడు రోజులపాటు వైభవోపేతంగా జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి కులమత భేదాలు లేకుండా వేలాది మంది భక్తులు ఇప్పటికే పొన్నాడ చేరుకున్నారు. వీరంతా అమ్మవారి ఆలయం పరిసర ప్రాంతాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని మూడు రోజులపాటు ఇక్కడే ఉండి ఉత్సవాల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే వేలాది మంది పొన్నాడ చేరుకున్నారు. ఆదివారం సంథల్ (గంధం) ఉత్సవంతో ముగియనున్న ఈ ఉత్సవాల్లో గంధోత్సవం అత్యంత ప్రధానమైనది. గంధోత్సవం కోసం స్థానిక ముజావర్లు ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీరోజూ ఖురాన్‌ఖాని, వాచ్, మిలాద్ షరీఫ్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బషీర్‌బీబీ ముస్లింల దేవతైనప్పటికీ అన్ని మతాలు, కులాలకు చెందిన భక్తులు దర్శించుకోవడం వల్ల ఈ ఉత్సవాన్ని మత సామరస్యానికి చిహ్నంగా చెబుతుంటారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాలికను వేధించిన కేసులో నిందితుడి అరెస్ట్

కపిలేశ్వరపురం: ఓ బాలికను ప్రేమించమని వేధిస్తున్నాడంటూ నమోదైన కేసులో కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామానికి చెందిన చొప్పల రవికుమార్ (నాని)ని శుక్రవారం అరెస్ట్ చేసినట్టు అంగర ఎస్సై అందే పరదేశి తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఈ నెల 13వ తేదీన బాలిక బస్సులో ప్రయాణిస్తుండగా నిందితుడు రవికుమార్ తనని ప్రేమించమని వేధించాడు. ఒప్పుకోకపోవడంతో తనను కొట్టిగాయపర్చి అవమానించాడంటూ బాలిక ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. నిందితుడిని అరెస్ట్ చేసి ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు ఎస్సై పరదేశి చెప్పారు.

బాకీ తీరుస్తామని చెప్పి టోకరా



నిందితులతో అన్నవరం ఎస్ఐ కిషోర్, తదితర పోలీసులు



ఫిర్యాదుదారుకు నిందితులు ఇచ్చిన బ్లాక్ నోట్లు, కెమికల్ బాటిల్స్

అన్నవరం: నల్ల కాగితాలకు కెమికల్ పూస్తే అవి రూ.500 నోట్ల కరెన్సీ నోట్లు అవుతాయని చెప్పి టోకరా వేయబోయిన పిఠాపురానికి చెందిన ముఠాను అన్నవరం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. గతంలో తన వద్ద తీసుకున్న రూ.20 లక్షల నగదు తిరిగి ఇస్తామని చెప్పి, కొన్ని నల్ల కాగితాల కట్టలు, కెమికల్ బాటిల్స్ ఇచ్చి మోసం చేశారని బిక్కవోలు మండలం పందలపాకకు చెందిన అనుసూరి రాజబాబు ఇచ్చిన ఫిర్యాదుపై నలుగురిని శుక్రవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ వి.కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం పిఠాపురానికి చెందిన ఈటి జగదీష్, కూరాకుల గంగా మహేశ్వర, అల్లి వీర్రాజు, పిట్టా రాజేంద్ర కుమార్ పందలపాలకు చెందిన అనుసూరి రాజబాబుకి రూ.20 లక్షలు బాకీ పడ్డారు. ఆ బాకీ చెల్లిస్తామని చెప్పి స్థానిక డిగ్రీ కళాశాల వద్దకు శుక్రవారం మధ్యాహ్నం ఆటోలో వచ్చారు. అక్కడ ఆయనకు నలుపు రంగు పూసిన కాగితాలతో కూడిన కట్టలు, ఒక బాటిల్ లిక్విడ్ ఇచ్చారు. ఆ లిక్విడ్ ఆ నల్లనోట్లకు పులిమితే అవి రూ.500 ఒరిజనల్ కరెన్సీగా మారతాయని చెప్పి మోసగించాలని యత్నించారు. గతంలో కూడా ఇలాగే తనను నమ్మించి మోసగించడంతో నిందితుడు ముందుగానే పోలీసులను ఆశ్రయించాడు. దీంతో జిల్లా ఎస్పీ కె.సతీష్‌కుమార్ ఆదేశాల ప్రకారం పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సీఐ ఎస్.లక్ష్మణరావు, స్థానిక ఎస్ఐ వి.కిషోర్ చాకచక్యంగా నిందితుల ఆటోపై దాడి చేసి ఆ నలుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి నలుపురంగు పూసిన నోట్ల కట్టలు, కెమికల్ బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. వారు ప్రయాణించిన ఆటో, మోటార్ సైకిల్ కూడా సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యార్థుల ప్రాణాలకు రక్షణ ఏదీ?



విద్యార్థులతో కొబ్బరి కాయలు తీయిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం: పాఠశాలకు చదువుకోవటానికి వచ్చిన విద్యార్థులను స్కూలుకు ఆనుకొని ఉన్న ప్రహరీ మీదుగా కొబ్బరి చెట్టు ఎక్కించి కొబ్బరి కాయలు తీయించిన ఘటన ఎస్.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని స్థానికులు తీసిన ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇందులో ఒక విద్యార్థి చెట్టుపైకి ఎక్కి కొబ్బరి కాయలు తీస్తుండగా, ముగ్గురు విద్యార్థులు గోడపైకి ఎక్కి ఉన్నారు. కింద నుంచి ఒక ఉపాధ్యాయుడు, విద్యార్థి సూచనలు ఇస్తున్నారు. ఇలాంటి సమయాల్లో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులనివిద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై హెచ్ఎం బి.రామకృష్ణను వివరణ కోరగా మధ్యాహ్నం సమయంలో డీఈవో కార్యాలయానికి సమావేశానికి వెళ్లానని, తాను పాఠశాలలో లేనప్పుడు ఇలా జరిగిందన్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు.